సాక్షి
పశ్చిమగోదావరి

ఆదివారం । 22 । అక్టోబర్ । 2023



మావుళ్లమ్మ సన్నిధిలో..

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం మావుళ్లమ్మవారిని రాష్ట్ర జీఎస్టీ కమిషనర్ కె.రవిశంకర్ దంపతులు దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు.



శ్రీనివాసా.. గోవిందా..

ద్వారకాతిరుమల: భవానీ దీక్షాధారులు, భక్తులతో చినవెంకన్న క్షేత్రం కిటకిటలాడింది. క్షేత్ర పరిసరాలు సందడిగా మారాయి. అన్ని విభాగాలూ రద్దీగా కనిపించాయి.

జెడ్పీ డిప్యూటీ సీఈఓగా నిర్మలాజ్యోతి



ఏలూరు (మెట్రో): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రజాపరిషత్ డిప్యూటీ సీఈఓగా ఎస్. నిర్మలాజ్యోతి శనివారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.



భీమవరం (ప్రకాశంచౌక్) : మావుళ్లమ్మవారు



తణుకు టౌన్ : మండపాక ఎల్లారమ్మ



పెనుగొండ : వాసవీ శాంతి ధామ్‌లో..

అమ్మా.. భవానీ

జై భవానీ.. జైజై భవానీ..

కరుణించమ్మా.. కనకదుర్గమ్మా.. అంటూ భక్తులు నీరాజనాలు అర్పించారు. శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవార్లు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. జిల్లావ్యాప్తంగా దసరా వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఆలయాలు, మండపాల్లో విశేష పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు.

- సాక్షి నెట్‌వర్క్



పాలకొల్లు సెంట్రల్ : క్షీరారామంలో అమ్మవారు



తాడేపల్లిగూడెం (టీఓసీ) : బలుసులమ్మవారు

న్యూస్‌రీల్

న్యాయమూర్తులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: కోర్టుల్లో పని ఒత్తిడి కారణంగా ఆస్పత్రులకు వెళ్లే సమయం కుదరక ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్న న్యాయశాఖ ఉద్యోగులకు కోర్టు ప్రాంగణంలో వైద్య శిబిరం ఏర్పాటుచేసినట్లు భీమవరం 3వ అదనపు జిల్లా న్యాయమూర్తి పి.శ్రీసత్యాదేవి చెప్పారు. శనివారం శనివారం భీమవరం కోర్టు ఆవరణలో న్యాయమూర్తులకు, న్యాయశాఖ సిబ్బంది, న్యాయవాదులకు పీహెచ్‌సీ డాక్టర్ దుర్గ నేతృత్వంలో ప్రాథమిక వైద్యపరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్, హిమోగ్లోబిన్ శాతం వంటి పరీక్షలను నిర్వహించి మందులు అందజేశారు. న్యాయమూర్తులు బి.అప్పలస్వామి, ఎ.పవన్‌కుమార్, జి.సురేష్‌బాబు, డి.ధనరాజు పాల్గొన్నారు.


దైవ దర్శనానికి వెళుతూ..



మణికంఠ మృతదేహం

భీమడోలు: జాతీయ రహదారిపై కాలినడకన విజయవాడ వెళుతుండగా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొన్న ప్రమాదంలో భవానీ మాలధారుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా పెద్దాపురం పట్టణానికి చెందిన మాలధారుడు తూరుపెల్లి మణికంఠ (22) భవానీ మాల ధరించి మండల దీక్ష పూర్తిచేసుకున్నాడు. తోటి మాలధారులతో కలిసి కాలినడకన విజయవాడ బయలుదేరాడు. మార్గమధ్యంలో ఏలూరు జిల్లా భీమడోలు మండలం అంబర్‌పేట పంచాయతీ శివారు కొండ్రెడ్డినగర్ వద్ద వేగంగా వచ్చిన వరపుత్ర ట్రావెల్స్ బస్సు శనివారం అతడిని ఢీకొట్టింది. అతడి తలకు బలమైన గాయం కాగా బస్సు డ్రైవర్ ఆటోలో భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలిస్తుండగా మృతిచెందాడు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు ఎస్సై చావా సురేష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మణికంఠ వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నాడు.

జిల్లా పరిశ్రమల అధికారిగా నాగరాజా



ఏలూరు(మెట్రో): జిల్లా పరిశ్రమల అధికారిగా జె.నాగరాజా శనివారం బాధ్యతలు చేపట్టారు. ముందుగా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌ను కలిసి పూలమొక్క అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి పథంలో నిలిపేందుకు కృషిచేయాలని, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని సూచించారు. నాగరాజా అన్నమయ్య జిల్లా పరిశ్రమల అధికారిగా పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. జిల్లా పరిశ్రమల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ జేసుదాసు ఉన్నారు.

పంచాయతీలకు ఈ-పోస్ యంత్రాలు

నగదురహితం.. సులభతరం

- సచివాలయాల్లో ఆన్‌లైన్ లావాదేవీలు
- తొలివిడతగా 268 మెషీన్లు అందజేత
- మరింత మెరుగైన పాలనకు చర్యలు

భీమవరం(ప్రకాశం చౌక్): గ్రామీణ ప్రజలు పంచాయతీలకు పన్నులు లేదా సచివాలయాల సేవల రుసుములు ఇకపై ఈ-పోస్ యంత్రాల (స్వైపింగ్ మెషీన్) ద్వారా చెల్లించే సదుపాయాన్ని ప్రభుత్వం తీసుకువచ్చింది. జిల్లాలోని అన్ని పంచాయతీలకు ఈ-పోస్ మెషీన్లు అందించి వాటి ద్వారా పారదర్శకమైన ఆర్థిక లావాదేవీలకు చర్యలు తీసుకుంటుంది. ఇప్పటివరకు పంచాయతీ కార్యదర్శులు నేరుగా ప్రజలను నుంచి పన్నులు, సేవల రుసుములు నగదు రూపంలో వసూలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నగదురహిత లావాదేవీలను ప్రోత్సహించడంతో పాటు ఎటువంటి అవకతవకలు జరగకుండా ఈ-పోస్ మెషీన్లు తీసుకువచ్చింది.

409 పంచాయతీలు

జిల్లాలో 409 గ్రామ పంచాయతీలకు ఈ-పోస్ మెషీన్లు అందించాల్సి ఉండగా తొలివిడతగా 268 ఈ-పోస్ మెషీన్లను ప్రభుత్వం మంజూరు చేసింది. మిగిలిన పంచాయతీలకు త్వరలో అందించనుంది. పంచాయతీ కార్యదర్శులకు ఈ-పోస్ మెషీన్లు అందించి వారి పర్యవేక్షణలో వీటి ద్వారా ఆర్థిక లావాదేవీలు నిర్వహించాలని అధికారులు ఆదేశించారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇవ్వనున్నారు.



ఈపోస్ మెషీన్

నగదురహిత లావాదేవీలతో ప్రయోజనం

పంచాయతీల్లో నగదురహిత లావాదేవీల కోసం ప్రభుత్వం ఈ-పోస్ మెషీన్లు అందుబాటులోకి తీసుకువచ్చింది. జిల్లాలో మొదటి విడతగా 268 మెషీన్లు వచ్చాయి. కలెక్టర్ ఆదేశాల మేరకు వెంటనే పంచాయతీ కార్యదర్శులకు అందించి వాటి ద్వారా పన్నులు చెల్లింపు, ఇతర సేవ రుసుముల చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటాం. మెషీన్ల వాడకంపై పంచాయతీ కార్యదర్శులకు వారి ద్వారా సచివాలయ సిబ్బందికి తెలియజేస్తాం. త్వరలో మిగిలిన పంచాయతీలకు కూడా ఈ-పోస్ మెషీన్లు రానున్నాయి.

- జీవీకే మల్లికార్జునరావు, జిల్లా పంచాయతీ అధికారి



ఈపోస్ మెషీన్ గురించి తెలియజేస్తున్న డీపీఓ

ఈ-పోస్ యంత్రాల ఉపయోగం

- అన్ని బ్యాంకుల ఏటీఎం కార్డులు, క్రెడిట్ కార్డులు ఈ మెషీన్‌పై స్వైపింగ్ చేసి పన్నులు చెల్లించవచ్చు.
- మెషీన్‌లో జనరేట్ అయిన స్కానర్‌పై ఫోన్‌పే, గూగుల్‌పే ఇతర యాప్‌ల ద్వారా స్కానింగ్ చేసి సులభంగా పేమెంట్ చేయవచ్చు.
- మెషీన్ ద్వారా పేమెంట్ చెల్లించిన వెంటనే ఆన్‌లైన్ రశీదు పొందవచ్చు.
- ఇలా చెల్లించడం ద్వారా ఎప్పుడు పన్నులు చెల్లించాం, సేవలకు ఎంత రుసుం అనేది సులభంగా తెలుస్తుంది.
- చెల్లించిన పన్నుల వివరాలు ఆన్‌లైన్‌లో రికార్డవుతాయి.
- నేరుగా పంచాయతీ ఖాతాలకు చెల్లించిన సొమ్ము జమవుతుంది.
- అవినీతికి తావులేకుండా ఆదాయం పంచాయతీల ఖాతాలకు చేరుతుంది.
- వేగంగా చెల్లింపుల ప్రక్రియ పూర్తవుతుంది.
- భవిష్యత్‌లో ఆన్‌లైన్ పన్ను రశీదు ఇతర అవసరాలకు ఉపయోగపడుతుంది.

సంక్షేమ పథకాల బోర్డులు ప్రదర్శించాలి

కలెక్టర్ ప్రశాంతి

భీమవరం(ప్రకాశంచౌక్): రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల పూర్తి వివరాలు అందరికీ తెలిసేలా గ్రామ, వార్డు సచివాలయంలో డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ నుంచి సచివాలయాల్లో మా నమ్మకం నువ్వే జగనన్న ప్రభుత్వ పథకాలు డిస్‌ప్లే బోర్డుల ఏర్పాటు, గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో (జీఈఆర్)పై ప్రత్యేక అధికారులు, మండల స్థాయి అధికారులు, పురపాలక సంఘం కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేరుగా బ్యాంకు ఖాతాలకు జమచేసేవి 25 పథకాలు, డీబీటీ 8 పథకాల వివరాల బోర్డులు పెట్టాలన్నారు. జిల్లాలో మొత్తంగా 515 డిస్‌ప్లే బోర్డులు అవసరం కాగా ఇప్పటివరకూ 119 బోర్డులు పంపించామన్నారు. బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలని, ఏ ఒక్క కేసు బయట ఉన్నా సంబంధిత అధికారులు బాధ్యత వహించాలని కలెక్టర్ అన్నారు. విద్యాశాఖ సర్వే చేసిన సీఆర్ యాప్, సచివాలయం వలంటీర్లు సర్వే చేసిన బీఓపీ యాప్‌ను పరిశీలించాని ఆదేశించారు. విద్యార్థులు చదువు కోసం జిల్లా, రాష్ట్రం మారినా వారి వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరచాలని కలెక్టర్ సూచించారు.

పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

కలెక్టర్ ప్రశాంతి

సాక్షి, భీమవరం: విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. శనివారం పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా భీమవరం వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీసులు మాతృభూమి శ్రేయస్సు కోసం నిస్వార్థకంగా పనిచేసే శ్రామికులని కొనియాడారు. సమాజ రక్షణ, శాంతి భద్రత పరిరక్షణలో పోలీసుల పాత్ర ప్రశంసనీయమైందన్నారు. అమరులైన పోలీసుల త్యాగనిరతి స్ఫూర్తిదాయకమని, వారిని అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్ మాట్లాడుతూ పోలీసులు విధి నిర్వహణే పరమావధిగా భావిస్తారన్నారు. ప్రజల కోసం నిరంతరం పోరాటం చేస్తున్న పోలీసు సేవలు అభినందనీయమన్నారు. దేశ చరిత్రలో పోలీసు సంస్మరణ దినాన్ని విశిష్టమైన రోజుగా భావిస్తున్నామన్నారు. జిల్లాకు చెందిన పోలీసులు వైవీఎస్ ప్రసాద్ (నరసాపురం టౌన్), ఆర్.శ్రీనివాసులు (మొగల్తూరు), పీవీ ప్రసాద్ (పెనుమంట్ర) ప్రత్యర్థి దాడుల్లో అమరులై ప్రాణాలర్పించారన్నారు. జిల్లా పోలీసు శాఖ బాధిత కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, వారి కోసం సంక్షేమ కార్యక్రమాలు చేపడతున్నామని చెప్పారు. ముందుగా పోలీసు గౌరవందనం స్వీకరించిన కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ రవిప్రకాష్ పోలీస్ అమరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. వైవీఎస్ ప్రసాద్, శ్రీనివాసులు, పీవీ ప్రసాద్ కుటుంబాలను ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. జిల్లా అదనపు ఎస్పీలు ఏవీ సుబ్బరాజు, ఏటీవీ రవికుమార్, భీమవరం ఆర్డీఓ దాసి రాజు, డీఎస్పీ బందారు శ్రీనాథ్, తహసీల్దార్ వై.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



అమరులైన పోలీసు కుటుంబాలను సత్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ రవిప్రకాష్

ఎన్నికల సామగ్రి తనిఖీలకు హాజరుకావాలి

భీమవరం (ప్రకాశంచౌక్): ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల తొలిదశ తనిఖీలకు రాజకీయ పార్టీల ప్రతినిధులు తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ పి.ప్రశాంతి కోరారు. శనివారం స్థానిక ఈవీఎం గోడౌన్ ప్రాంగణంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆమె సమావేశం నిర్వహించారు. జిల్లాకు 4,650 బ్యాలెట్ యూనిట్లు, 3,640 కంట్రోల్ యూనిట్లు, 4,550 వీవీ ప్యాట్లు అందాయని తెలిపారు. ఈనెల 20 వరకు 850 బ్యాలెట్ యూనిట్లను, 843 కంట్రోల్ యూనిట్లను, 841 వీవీ ప్యాట్లను తనిఖీ చేశామన్నారు. ఐదు శాతం ఈవీఎంలతో మాక్‌పోల్ నిర్వహించామన్నారు. డీఆర్వో కె.కృష్ణవేణి, సూపరింటెండెంట్ లక్కు నరసింహారావు, డీటీ ఎం.సన్యాసిరావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

విషాదం నింపిన విహారయాత్ర

- గోదావరిలో నలుగురు యువకుల గల్లంతు
- యానాం విహార యాత్రకు వెళ్లగా ఘటన
- తాళ్లరేవు మండలం గోపులంక పుష్కర్‌ఘాట్ వద్ద ప్రమాదం
- తణుకులో విషాదఛాయలు



ప్రమాదానికి ముందు స్నేహితులంతా కలిసి తీసుకున్న సెల్ఫీ

తణుకు: విహారయాత్రకు వెళ్లి గోదావరిలో దిగిన నలుగురు యువకులు గల్లంతు కావడంతో తణుకులో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి. తణుకు పట్టణానికి చెందిన ఏడుగురు యువకులు విహారం కోసం యానాం వెళ్లి తిరుగు ప్రయాణంలో తాళ్లరేవు మండలం గోపులంక వద్ద పుష్కరఘాట్‌లో స్నానానికి దిగారు. వీరిలో నలుగురు గల్లంతు కాగా ముగ్గురు సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. హనుమకొండ సాయికార్తీక్ (21), ముద్దన ఫణీంద్రగణేష్ (21), పెండ్యాల బాలాజీ (21), తిరుమల రవితేజ (21) గల్లంతుకాగా నేదూరి భానుప్రసాద్, కొమ్మిరెడ్డి చైతన్య, సలాది దుర్గామహేష్ సురక్షితంగా బయటపడ్డారు. అయితే గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు జరుగుతుండగా ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.

పుట్టినరోజు పార్టీ కోసం వెళ్లి..

తణుకుకి చెందిన వీరంతా కలిసి శనివారం ఉదయం మూడు మోటార్ సైకిళ్లపై యానాం బయలుదేరి వెళ్లారు. సాయికార్తీక్‌ది వారం రోజుల క్రితం పుట్టినరోజు కాగా స్నేహితులకు పార్టీ ఇస్తానని చెప్పి స్కూల్ ఫ్రెండ్స్ అందరినీ కలిపి యానాం తీసికెళ్లినట్టు తోటి స్నేహితులు చెబుతున్నారు. గల్లంతైన వారిలో సాయికార్తీక్ డిప్లొమా మధ్యలో ఆపేయగా, ఫణీంద్రగణేష్ బీటెక్ సెకండియర్, బాలాజీ బీటెక్ ఫైనలియర్ చదువుతుండగా, రవితేజ డిగ్రీ పూర్తి చేసి ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాడు. సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్న భానుప్రసాద్ డ్రైవర్‌గా పనిచేస్తుండగా దుర్గామహేష్ బీటెక్ ఫైనలియర్ చదువుతున్నాడు. కొమ్మిరెడ్డి చైతన్య బిర్యానీ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. గల్లంతైన ఫణీంద్రగణేష్ సోదరి వివాహం ఇటీవల జరగ్గా తండ్రి ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశానికి వెళ్లారు. అయితే యానాంలో పార్టీ చేసుకున్న వీరంతా తిరిగి స్వస్థలాలకు సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో బయలుదేరారు. యానాం నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న గోపులంక గ్రామంలోని పుష్కర్‌ఘాట్ వద్దకు చేరుకుని గోదావరిలో స్నానానికి దిగడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ముందుగా సాయికార్తీక్ గట్టుపైనుంచి గోదావరిలో దూకి మునిగిపోతుండగా అతడిని కాపాడేందుకు వెళ్లిన ఫణీంద్రగణేష్, బాలాజీ, రవితేజ కొట్టుకుపోయినట్టు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. భానుప్రసాద్, చైతన్య, దుర్గామహేష్ సైతం వీరిని కాపాడేందుకు ప్రయత్నించినా కళ్ల ముందే నీటి ప్రవాహానికి కొట్టుకుపోవడంతో తీవ్ర విషాదంతో వెనుదిరిగి ఒడ్డుకు చేరుకున్నారు.



గల్లంతైన వారు ముద్దన ఫణీంద్రగణేష్, హనుమకొండ సాయికార్తీక్, పెండ్యాల బాలాజీ, తిరుమల రవితేజ (ఫైల్)

'ఓపెన్' ఫీజు చెల్లింపునకు నెలాఖరు వరకు గడువు

సాక్షి, భీమవరం: వచ్చే ఏప్రిల్‌లో నిర్వహించనున్న ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల ఫీజు చెల్లించడానికి ఈనెల 31వ తేదీ వరకు గడువు ఉందని డీఈఓ ఆర్.వెంకటరమణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. గత జూన్, జూలైలో పరీక్షలకు హాజరై ఫెయిలైన విద్యార్థులు వచ్చే ఏడాది జరిగే పరీక్షలకు హాజరుకావడానికి ఫీజు చెల్లింపు తేదీని ప్రకటించినట్టు పేర్కొన్నారు.

9 మంది జూదరుల అరెస్టు..

కాళ్ల : ఏలూరుపాడు శివారులో చేపల చెరువు గట్టుపై శుక్రవారం రాత్రి పేకాడుతున్న తొమ్మిది మంది వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఆకివీడు రూరల్ సీఐ సత్యనారాయణ చెప్పారు. శనివారం కాళ్ల స్టేషన్‌లో ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఎస్పీ యు.రవిప్రకాష్ ఆదేశాల మేరకు స్పెషల్ బ్రాంచ్, కాళ్ల పోలీసులు సంయుక్తంగా దాడి చేసి తొలుత ఆరుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.3.16 లక్షల నగదు, ఆరు సెల్‌ఫోన్లు, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇదే కేసులో పరారీలో ఉన్న మరో ముగ్గురిని శనివారం అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని చెప్పారు. పేకాట, కోడిపందేలు ఆడినా, నిర్వహించినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. ఎస్సై వీరభద్రరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో వంచన.. ఇద్దరి అరెస్టు

సాక్షి, భీమవరం: యువతిని ప్రేమపేరుతో మోసం చేసిన యువకుడిని, సహకరించిన అతడి సోదరుడ్ని శనివారం అరెస్టు చేసినట్లు భీమవరం టుటౌన్ సీఐ జి శ్రీనివాస్ చెప్పారు. కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం ఈదరాడ గ్రామానికి చెందిన యువతి పట్టణంలోని ఒక రొయ్యల కంపెనీలో పనిచేస్తోంది. ఆమెకు మొగల్తూరు మండలం నీటితిప్పకు చెందిన అడ్డాల వంశీకృష్ణతో పరిచయమైంది. ఈ క్రమంలో ఆమెకు మాయమాటలు చెప్పి వివాహేతర సంబంధం ఏర్పరుచుకోవడమేకాక రూ.15 లక్షలు ఇవ్వాలంటు డిమాండ్ చేశాడు. దీనికి వంశీకృష్ణ సోదరుడు తారకరామారావు సహకరించాడని యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులు ఇద్దరిని అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

వర్షాభావం ఉంటే.. యూరియా చల్లండి

ఏలూరు (మెట్రో): ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో వరి చేలల్లో రెండు శాతం యూరియా లేదా పొటాషియం నైట్రేట్‌లను పిచికారీ చేసి పంటను రక్షించుకోవాలని జేడీఏ వై.రామకృష్ణ రైతులకు సూచించారు. పంటలపై వర్షాభావ పరిస్థితుల ప్రభావం – చేపట్టాల్సిన చర్యలు అనే అంశంపై ఏలూరులో శనివారం ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు, ఏడీఏలతో నిర్వహించిన వర్క్‌షాపులో ఆయన మాట్లాడారు. ఖరీఫ్‌కు సరిపడా సాగునీరు అందుబాటులో ఉన్నందున రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మార్టేరు సహ పరిశోధనా సంచాలకులు డాక్టర్ ఎం.భరతలక్ష్మి, విజయరాయి వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త కె.మోహనరావు, ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ టి.సుజాత, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

సందడిగా దసరా మార్కెట్

కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న దుకాణాలు

భీమవరం (ప్రకాశం చౌక్) : దసరా పండగ నేపథ్యంలో కొనుగోళ్లు ఊపందుకోవడంతో మార్కెట్ కళకళాడుతోంది. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో దుస్తులు, బంగారం, గృహోపకరణ, వాహనాలు, కిరాణా తదితర దుకాణాలన్నీ వినియోగదారులతో కిటకిటలాడుతున్నాయి. దస్తులు, బంగారం, కిరాణా రూ.కోట్లలోనే వ్యాపారాలు సాగుతున్నాయి. దసరా పండగ సందర్భంగా గృహోపకరణ వస్తువులు, దుస్తులపై వ్యాపారులు ప్రత్యేక ఆఫర్లు ఇచ్చి వినియోగదారులను ఆకర్షిస్తున్నారు.

జోరుగా విక్రయాలు

టీవీ, ఫ్రిజ్, ఏసీ తదితర గృహోపకరణ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఈ వస్తువుల కొనుగోళ్లపై ప్రత్యేక డిస్కౌంట్‌లు, క్యాష్ బ్యాక్ ఆఫర్లతో వినియోగదారులను ఆకర్షిస్తున్నారు. జిల్లాలో గృహోపకరణ వస్తువుల అమ్మకాల ద్వారా రూ.70 కోట్ల నుంచి రూ.80 కోట్ల వరకు వ్యాపారం జరుగుతుందని అంచనా. అలాగే దుస్తులపై ఈ దసరా సీజన్‌లో రూ.50 కోట్ల అమ్మకాలు జరుగుతాయని, ఇప్పటివరకు రూ 40 కోట్లపైనే అమ్మకాలు జరిగాయంటున్నారు. ఆదివారం సెలవు కావడంతో దుస్తులు కొనుగోళ్లు ఎక్కువగా ఉంటాయని వ్యాపారులు అంచనా వేస్తున్నారు. ఇటీవల ధర పెరుగుతున్నా బంగారం కొనుగోళ్లపై ప్రభావం చూపడం లేదు. శనివారం ఎనిమిది గ్రాముల బంగారం ధర రూ.45,280 వరకు ఉంది. సోమవారం పండగ సందర్భంగా కొనుగోళ్లు ఆశాజనకంగా ఉన్నాయి. పండగ సందర్భంగా రూ.50 నుంచి రూ.60 కోట్ల మేర అమ్మకాలు జరుగుతాయని వ్యాపారులు చెబుతున్నారు. అలాగే దసరా పండగ సందర్భంగా మాలధారులు పూజలు, అన్నసమారాధనలతో పాటు సాధారణ ప్రజలు కూడా ప్రత్యేక వంటకాలు చేస్తుంటారు. ఈ నేపథ్యంలో కిరాణా వ్యాపారం కూడా ఈ పండగ సీజన్‌లో రూ.100 కోట్ల అమ్మకాలు జరుగుతాయని అంచనా వేస్తున్నారు.




భీమవరంలో రద్దీగా ఉన్న ఓ వస్త్రదుకాణం, కళకళలాడుతున్న ఓ గృహోపకరణ వస్తువుల దుకాణం

● కరెన్సీ ధనలక్ష్మి



పాలకొల్లు సెంట్రల్ : పాలకొల్లులో రూ.1.16 కోట్ల కరెన్సీ నోట్ల అలంకరణలో ధనలక్ష్మిగా దర్శనమిస్తున్న శ్రీవాసవి మాత

శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం భారీ కరెన్సీతో అమ్మవార్లను, ఆలయాలను అలంకరించారు. పాలకొల్లులోని శ్రీవాసవి ఆర్యవైశ్య మండపంలో అమ్మవారిని, అలాగే నీలాద్రిపురంలో శ్రీఉమా చంద్రశేఖరరెడ్డి స్వామి ఆలయంలో ఉమాదేవిని కరెన్సీ నోట్లతో ధనలక్ష్మీదేవిగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవార్లను దర్శించారు.

– సాక్షి నెట్‌వర్క్



తాడేపల్లిగూడెం రూరల్ : నీలాద్రిపురంలో రూ.25 లక్షల కరెన్సీ నోట్ల అలంకరణతో ధనలక్ష్మి దేవిగా దర్శనమిస్తున్న ఉమాదేవి

ఇంటర్ ఫెయిలైనవారితో పరీక్ష ఫీజు కట్టించాలి

సాక్షి, భీమవరం: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఫెయిల్ అయిన విద్యార్థులు తిరిగి పరీక్షలు రాయడానికి ఫీజు చెల్లించేలా కళాశాలల అధ్యాపకులు కృషి చేయాలని ఇంటర్మీడియట్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.చంద్రశేఖర్‌బాబు సూచించారు. భీమవరంలోని సీఎస్ఎన్ కళాశాలలో శనివారం ఇంటర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గడిచిన రెండేళ్లల్లో ఇంటర్ రెండో ఏడాది పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులను గుర్తించి వారిని తిరిగి పరీక్ష రాసేలా ప్రోత్సహించాలన్నారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో మంచి ఫలితాలు సాధించే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దాలని చంద్రశేఖర్‌బాబు అన్నారు. ఈ సమావేశంలో వివిధ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

డ్రైవింగ్‌లో నిర్లక్ష్యంగా ఉంటే మూల్యం తప్పదు



ఏలూరులో పరిహారం చెక్కును అందిస్తున్న జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి జి.రామగోపాల్

ఏలూరు (టూటౌన్): ప్రమాదాలు జరగకుండా ప్రతి వ్యక్తి తగు జాగ్రత్తతో వాహనాలు నడపాలని, లేకపోతే మూల్యం చెల్లించుకోక తప్పదని మొదటి అదనపు జిల్లా జడ్జి, జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి జి.రామగోపాల్ అన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా శనివారం వాహన ప్రమాద బీమా, రెవెన్యూ కేసులపై ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ భవన్‌లో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రమాదంలో మృతుల కుటుంబాలకు సత్వర పరిహారం అందించడం కోసం ఈ ప్రత్యేక లోక్ అదాలత్ ఉపయోగపడుతుందన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యం తాగి వాహనాలు నడపరాదని, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం వల్ల వాహన ప్రమాదాలను నివారించవచ్చన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో రెండో అదనపు జిల్లా జడ్జి పి.మంగాకుమారి, ఎనిమిదో అదనపు జిల్లా జడ్జి ఎం.సునీల్ కుమార్, ఐదో అదనపు జిల్లా జడ్జి జి.రాజేశ్వరి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కేకేవీ బుల్లికృష్ణ, బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ నోముల రాముడు, ప్రభుత్వ న్యాయవాది బీజే రెడ్డి, మానసిక వైద్యులు వంశీకృష్ణ, పలువురు న్యాయవాదులు, వివిధ బీమా కంపెనీల అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యేక లోక్ అదాలత్‌లో 72 కేసుల పరిష్కారం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన ప్రత్యేక లోక్ అదాలత్‌లో మొత్తం 72 వాహన ప్రమాద కేసులు పరిష్కారమై మొత్తం రూ.4 కోట్ల 10 లక్షల 70వేలు ప్రమాద బీమాగా చెల్లించనున్నారు. అదేవిధంగా మూడు వర్క్‌మెన్ కాంపెయిన్ కేసులకు సంబంధించి రూ.19.19 లక్షలు, ఒక ప్రీలిటిగేషన్ కేసులో రూ.3 లక్షలు పరిహారంగా చెల్లించనున్నారు. న్యూ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీకి సంబంధించి ఒక కేసు రూ.25 లక్షలను పరిహారంగా చెల్లించారు. ప్రత్యేక లోక్ అదాలత్ సందర్భంగా ఏలూరు కోర్టు ఆవరణలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బందికి, న్యాయవాద గుమస్తాలకు ఉచిత కంటి వైద్య పరీక్షలను నిర్వహించారు.

క్లుప్తంగా

వరాల వెంకన్నకు విశేష పూజలు



ఈడూరులో విశేష అలంకరణలో వరాల వెంకటేశ్వరస్వామి

అత్తిలి: ఈడూరు గ్రామంలో వేంచేసియున్న వరాల వెంకటేశ్వరస్వామికి శనివారం విశేష పూజలు జరిపారు. వేకువ జామున స్వామి వారికి సుప్రభాతసేవ, తోమాలు సేవ నిర్వహించారు.ఉదయం అర్చనలు జరిపి, ప్రత్యేకంగా అలంకరించారు. రాత్రి ఊంజల్ సేవ నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు కాలినడకన హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

కోర్టులో వైద్య శిబిరం



తణుకు కోర్టులో వైద్యసేవలందిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆదేశాలమేరకు తణుకు కోర్టు ఆవరణలో నాల్గవ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ డి.సత్యవతి ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఎన్జీవో కాలనీలోని అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ పృథ్విరాజ్ కోర్టు సిబ్బంది, న్యాయవాదులు, కక్షిదారులైన 100 మందికి వైద్యసేవలు అందచేశారు. ఈ సందర్భంగా సుగర్, బీపీ వైద్య పరీక్షలు నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి కె.కృష్ణసత్యలత, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి.సాయిరామ్, స్పెషల్ మేజిస్ట్రేట్ పీఎస్‌పీ చిరంజీవిరావు వైద్య శిబిరాన్ని పర్యవేక్షించారు.

యోగాతో మానసిక ఉల్లాసం

తాడేపల్లిగూడెం (టీఓసీ): చిన్న వయస్సు నుంచే యోగా చేయాలని, తద్వారా ఆరోగ్యం, మానసిక ఉల్లాసానికి ఎంత ఉపయుక్తమని లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్ సభ్యురాలు చిక్కాల భ్రమరాంబికా అన్నారు. పట్టణంలో జరిగిన యోగా శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు శనివారం శిక్షణా అనంతరం పౌష్టికాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కార్గో సేవలు విస్తృతం చేయాలి



డిపోలో గేట్ మీటింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆర్టీసీ కార్గో సేవలు విస్తృతం చేయాలని తాడేపల్లిగూడెం డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ మూర్తి అన్నారు. డిపో వద్ద శనివారం గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఏపీ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ గత సంవత్సరం పార్శిల్ బుకింగ్స్‌పై రోజు వారీ ఆదాయం రూ 46 లక్షలు సాధించగా, వినియోగదారులు ఆదరణతో నేడు రూ. 50 లక్షల ఆదాయం వస్తుందని తెలిపారు. పార్శిల్ సర్వీస్ డోర్ డెలివరీని విస్తృత ప్రచారం కల్పించేందుకు ఈ నెల 26వ తేదీ నుంచి నవంబర్ 25 వరకు వివిధ కార్యక్రమాలు రూపొందిస్తున్నట్లు తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు శ్రీరామ రక్ష

- తణుకు, తాడేపల్లిగూడెం డివిజన్లలో జగనన్న ఆరోగ్య శిబిరాల ఏర్పాటు
- ఉచితంగా మందుల పంపిణీ



తణుకు అర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న మంగెన సూర్య



తాడేపల్లిగూడెం రూరల్: మోదుగ గుంట హైస్కూల్‌లో మాట్లాడుతున్న అంజనేయులు



అత్తిలి: వరిఘేడులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జెడ్పీటీసీ

తణుకు అర్బన్: పేదవర్గాలందరికీ ఖరీదైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశ్యంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని తీసుకువచ్చారని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య అన్నారు. తణుకు నంబరు 1 మున్సిపల్ స్కూల్, బ్యాంక్ కాలనీలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్య మాట్లాడుతూ పేదలకు వచ్చే ప్రతి అనారోగ్య సమస్యను గుర్తించి వైద్యసేవలు అందించాలనే సదుద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారని, ఈ శిబిరంలో అన్ని విభాగాలకు చెందిన స్పెషలిస్ట్ వైద్యులు అందుబాటులో ఉంటున్నారని అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిబిరంలో జనరల్ మెడిసిన్‌తోపాటు కంటి, పంటి, ఆర్థోపెడిక్, మానసిక సంబంధిత విభాగాలకు చెందిన వైద్యులు అందుబాటులో ఉంటున్నారని అన్నారు. పీపీ యూనిట్ వైద్యాధికారి డాక్టర్ బి.దుర్గామహేశ్వరరావు మాట్లాడుతూ రెండు చోట్ల ఏర్పాటు చేసిన శిబిరాల్లో 2వేల మంది హాజరై వైద్యసేవలు పొందారని, కంటికి సంబంధించి అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు, కళ్లజోళ్లు ప్రభుత్వం ఉచితంగానే అందజేస్తుందన్నారు. అనంతరం శిబిరానికి హాజరైన ప్రజలందరికీ భోజనవసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యవిభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దాట్ల సుందరరామరాజు, మారిశెట్టి శేషగిరి, గారపాటి సత్యనారాయణ, రమేష్, అభిషేక్, నారాయణ అప్పారావు, మున్సిపల్ ఉద్యోగులు, వార్డు సెక్రటరీలు, వలంటీర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా మెరుగైన వైద్యసేవలు

అత్తిలి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేదల ఆరోగ్య సమస్యలను గుర్తించి, మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని జెడ్పీటీసీ సభ్యురాలు అడ్డాల జానకి అన్నారు. అత్తిలి మండలం వరిఘేడు గ్రామంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జెడ్పీటీసీ జానకి మాట్లాడుతూ పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సీఎం జగన్ శ్రీకారం చుట్టారన్నారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా మార్చాలన్నదే సీఎం జగన్ ధ్యేయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పంపన సత్యవతి, ఉపసర్పంచ్ అడ్డాల రమేష్‌నాయుడు, ఎంపీటీసీ సభ్యుడు అనిశెట్టి త్రిమూర్తులు, వైఎస్సార్‌సీపీ నాయకులు అడ్డాల వెంకటరత్నంబాబు, మండల ప్రత్యేక అధికారి మురళీకృష్ణ, ఎంపీడీవో ఎండీ అమీలుజమా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం శ్రీదేవి, సెక్రటరీ శ్రీనివాస్, వైద్యులు డాక్టర్ కె నాగరాజు, పి కిరణ్, సాయిబాలాజీ, గౌతమి, సీహెచ్‌ఓ పి మురళి, హెచ్ఈ ప్రమీలారాణి, జెఏస్ గనిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆహారపు అలవాట్లతో అనారోగ్య సమస్యలు

తాడేపల్లిగూడెం రూరల్: మనం తీసుకునే ఆహారం వల్ల అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు అన్నారు. శనివారం మండలంలోని మోదుగ గుంట హైస్కూల్ ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ ఆంజనేయులు మాట్లాడుతూ వయస్సుతో సంబంధం లేకుండా బీపీ, సుగర్‌లు వ్యాప్తి చెందుతున్నాయన్నారు. సుగర్ శరీర అవయవాలపై ప్రభావం చూపుతుందన్నారు. అలాగే బీపీ, గుండె సమస్యలకు కారణమవుతుందన్నారు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దూరదృష్టితో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వైసీఎంపీపీ కట్టా రంగబాబు, మండల సచివాలయాల కన్వీనర్ ముప్పిడి సంపత్‌కుమార్ మాట్లాడారు. అనంతరం 1176మంది రోగులకు వైద్యులు టి.సింధూ, శ్రీహర్ష, టి.సూర్య సుభాషి, బి.లాలు నాయక్, కాంచన ప్రియలు వైద్య సేవలందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్పీటీసీలు మార్లపూడి సుబ్బారావు, మట్టా సత్యనారాయణ, మాజీ ఉప సర్పంచ్ ఏపూరి సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ఆర్.శ్రీనివాస్, ఎంపీహెచ్ఈవో జి.వెంకటేశ్వరరావు, సీహెచ్‌వోలు గాయత్రీ దేవి, వి.రూత్, సూర్యవరప్రసాద్, కృపా జాకబ్, బాబ్జీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.బేబి, నాయకులు చీకట్ల మల్లేశ్వరరావు, కట్టా జానకీరామయ్య, అయినపర్తి సుబ్బారావు, గరగ మాణిక్యం, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఇరగవరం:జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న దృశ్యం



పెంటపాడు: ఆరోగ్య సురక్ష శిబిరంలో పౌష్టికాహార స్టాల్స్ పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

జగనన్న ఆరోగ్య సురక్షతోనే నాణ్యమైన వైద్యం

పెంటపాడు: సీఎం జగనన్న ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమం కార్పొరేట్ వైద్యంతో సమానమని దీనిని అన్ని వర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్, డీపీవో జీవీకే మల్లికార్జునరావులు పేర్కొన్నారు. జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమాన్ని శనివారం పెంటపాడు మండలం రాచర్ల ఎంపీయుపీ స్కూల్ వద్ద కైగాల శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వాకా వెంకట దుర్గాభవాని అధ్యక్షతన జరిగిన సమావేశంలో కైగాల మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజల ఆరోగ్యం కోసం శ్రమిస్తున్నారన్నారు. బీసీ సంఘ నాయకులు వాకా సుబ్బారావు, ఎంపీటీసీ చింతన శారద, మాజీ సర్పంచ్ దోకల కమలాకర్, చింతన నారాయణ, ఎంపీడీవో సీహెచ్. బాలాజీ, ఈవోపీఆర్డీ ప్రసాద్, ముదునూరు వైద్యాధికారిణి డాక్టర్ పూజిత, పెంటపాడు వైద్యాధికారి డాక్టర్ తోట రాజేష్, గ్రామ కార్యదర్శి కేవీ రామారావు, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలతో పాటు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు మేలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): జగనన్న ఆరోగ్య సురక్షను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వార్డు ఇంచార్జిలు మిద్దె ఆదినారాయణ, నీరుకొండ పండులు అన్నారు. పట్టణంలో 14వ వార్డులో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం అసిస్టెంట్ కమిషనర్ గోపాలరావు అధ్యక్షతన జరిగింది. ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఓ కె.సురేష్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రవికుమార్, వైద్యులు, సచివాలయం సెక్రటరీలు, వలంటీర్లు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఇరగవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష

ఇరగవరం: మండలంలోని ఇరగవరం సచివాలయం-2 పరిధిలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని మండల ప్రత్యేక అధికారి, జిల్లా డ్వామా పీడీ రాజేశ్వరరావు పరిశీలించారు. అనంతరం పీడీ రాజేశ్వరరావు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ శిబిరంలో 1209మంది పరీక్షలు చేసి ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కంకిపాటి శ్రీనివాస్, ఎంపీటీసీ మంగెన రామా నాయుడు, జిల్లా డాక్టర్స్ సెల్ అధ్యక్షుడు డి సుందర రామరాజు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, మండల పార్టీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, నాయకలు సత్యనారాయణ, ఎంపీడీవో ఎ శ్రీనివాస్, అధికారులు నాయకలు, వైద్యులు బంగారు రవి, తదితరులు పాల్గొన్నారు.

ఇరగవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష

ఇరగవరం: మండలంలోని ఇరగవరం సచివాలయం-2 పరిధిలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని మండల ప్రత్యేక అధికారి, జిల్లా డ్వామా పీడీ రాజేశ్వరరావు పరిశీలించారు. అనంతరం పీడీ రాజేశ్వరరావు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్పంచ్ కంకిపాటి శ్రీనివాస్, ఎంపీటీసీ మంగెన రామా నాయుడు, జిల్లా డాక్టర్స్ సెల్ అధ్యక్షుడు డి సుందర రామరాజు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, మండల పార్టీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, సత్యనారాయణ, ఎంపీడీవో ఎ శ్రీనివాస్, అధికారులు నాయకలు, వైద్యులు బంగారు రవి, తదితరులు పాల్గొన్నారు.



బాదంపూడి - ప్రత్తిపాడు రహదారికి రూ.10కోట్లు మంజూరు

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్, పెంటపాడు: బాదంపూడి నుంచి ప్రత్తిపాడు వై.జంక్షన్ వరకు ఉన్న రహదారిని రూ.10కోట్లతో నిర్మించేందుకు నిధులు మంజూరు చేశామని, తొలి దశలో రూ.6.90కోట్లు నిధులు ఇచ్చామని, మరో రూ.3.10కోట్లు నిధులకు సీఎం అనుమతి లభించిందని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ తెలిపారు. శనివారం రాత్రి మండలంలోని ముత్యాలంబాపురం ముత్యాలమ్మ వారిని, పట్టణంలోని శ్రీవాసవి మాత, బలుసులమ్మ, గాయత్రీదేవి, పెంటపాడు మండలం ప్రత్తిపాడు వై.జంక్షన్‌లోని కనకదుర్గమ్మవార్ల ఆలయాలను ఆయన దర్శించుకున్నారు. తొలుత ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవార్లకు డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ ఇప్పటికే చిలకంపాడు నుంచి నుంచి వెంకట్రామన్నగూడెం వరకు రహదారి నిర్మాణం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ముత్యాలమ్మ దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ మాకా బాలాజీ, ఆలయ కార్యనిర్వహణాధికారి పి.హరేరాంప్రసాద్, విజయవాడ దుర్గా మల్లేశ్వరస్వామివారి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడు చెన్నా జనార్ధనరావు, నాయకులు వెల్నాటి సత్తిబాబు, రాజా త్రినాథ్, సుచిత్ర రెడ్డి, మాకా శేషగిరిరావు, సత్తి రాధాకృష్ణ, సత్తి నాగేశ్వరరావు, మట్టా మంగతాయారు, కైకరం రామాంజనేయులు, మాకా హరికృష్ణ పాల్గొన్నారు.



ముత్యాలంబాపురం ముత్యాలమ్మను దర్శించుకున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

సైన్స్ పట్ల అవగాహన పెంచుకోండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): దసరా సెలవులు సందర్భంగా పట్టణంలోని ప్రథమశ్రేణి గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన శిక్షణా శిబిరంలో శనివారం పాల్గొన్న విద్యార్థినీ, విద్యార్థులకు విశ్రాంత ఉద్యోగి బాపయ్య శర్మ, హైదరాబాద్‌కు చెందిన కేవీ సత్యప్రకాశ్, విశ్రాంత ఎంఈఓ సాల్మన్‌రాజులు పుస్తక పఠనం వల్ల ఉపయోగాలు, సైన్స్, జనరల్ నాలెడ్జి తదితర విషయాలపై అవగాహన కల్పించారు.

అపురూపం.. ఆ వైభవం



అత్తిలి: శ్రీలలితా త్రిపుర సుందరీదేవిగా కనకదుర్గమ్మ

దేవి శరన్నవరాత్రుల మహోత్సవాల ఏడోరోజు అమ్మవారు శ్రీ లలితా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వాడవాడలా అమ్మవారి విగ్రహాలను ప్రతిష్టించి, ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ సభ్యులు, యువత మాల ధారణ చేసి విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. జై.దుర్గ, జైజై దుర్గ అంటూ భక్తులు నినదించగా.. గ్రామాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

– సాక్షి, నెట్‌వర్కు